క్లుప్తంగా

శ్రీవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



శ్రీవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువ జామునే సుప్రభాత సేవ, తోమాల సేవ నిర్వహించి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. సాయంత్రం ఏర్పాటు చేసిన అన్నమయ్య సంకీర్తనలు, కోలాటాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

క్రమబద్ధీకరణ కోసం ఇళ్ల పరిశీలన



మర్రిబందలో ఇళ్ల డాక్యుమెంట్లు పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆనందరావు

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లి పంచాయతీ మర్రిబంద, కృష్ణాపురం గ్రామాల్లో తహసీల్దార్ కె.ఆనందరావు శనివారం పర్యటించారు. ఈ గ్రామాల్లో పలువురు ఇళ్ల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకోవడంతో వారి ఇళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. కరెంటు బిల్లు, ఇంటి పన్ను రసీదులను పరిశీలించారు.

ప్రభుత్వ భూమిలో షెడ్ల తొలగింపు

పద్మనాభం: మండలంలోని రేవిడిలో ప్రభుత్వ భూమిలో వేసిన రెండు రేకుల షెడ్లను రెవెన్యూ అధికారులు శనివారం తొలగించారు. సర్వే నంబర్ 8 లోని పోరంబోకులో ఉన్న కాలువ గట్టుపై ఈ షెడ్లు వేయడంతో వీటిని తొలగించారు.

జిమ్సర్‌లో ఘనంగా పట్టభద్రుల దినోత్సవం



వైద్య డిగ్రీ పట్టా ప్రదానం చేస్తున్న ప్రొఫెసర్ బలరామ భార్గవ

కొమ్మాది: గీతం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్సర్)లో పట్టభద్రుల దినోత్సవా న్ని శనివారం ఘనంగా నిర్వహించారు. వైద్య విద్య ను పూర్తి చేసుకున్న 305 మంది గీతం వైద్య కళాశా ల, దంత వైద్య కళాశాలల విద్యార్థులకు ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్ మాజీ డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ బలరామ భార్గవ పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ వైద్య నిపుణులకు ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు ఉందన్నారు. కార్యక్రమంలో గీతం అధ్యక్షుడు ఎం. శ్రీభరత్, వీసీ యరోల్ డిసౌజా తదితరులు పాల్గొన్నారు.

పొక్లెయిన్, లారీ సీజ్

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీ కురపల్లిలో శుక్రవారం రాత్రి అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్న పొక్లెయిన్, గ్రావెల్ లోడ్ అవుతున్న లారీని పట్టుకుని సీజ్ చేసినట్టు పోలీసులు తెలిపారు. తగు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ దృష్టికి తీసుకు వెళ్లామన్నారు.

కళాకారుడు రాముకు నివాళి

మధురవాడ: ప్రజాకళాకారుడు పందిరి రాము పాటల ద్వారా ప్రజల మదిలో చిరకాలం గుర్తుండిపోతారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.కె.ఎస్.వి.కుమార్, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి ఎం.చంటి, పారసం క్షేమ సంఘం అధ్యక్షుడు నాగోతి సూర్యప్రకాశ రావు తదితరులు అన్నారు. శివశక్తి నగర్‌లోని పందిరి రాము ఇంటి వద్ద శనివారం నిర్వహించిన సంస్మరణ సభలో ప్రజానాట్యమండలి కళాకారులు పాటలతో నివాళులు అర్పించారు. సీపీఎం నాయకులు అప్పలరాజు, ఐద్వా నాయకురాలు భారతి, కృష్ణారావు పాల్గొన్నారు.

25న సాగర దుర్గ ఉత్సవం

పద్మనాభం: మద్ది గ్రామంలో ఈ నెల 25వ తేదీన సాగర దుర్గ ఉత్సవాన్ని నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్త బుగత సత్యనారాయణ తెలిపారు. గ్రామంలో ఆదివారం ఉత్సవ చాటింపు ఉంటుందని పేర్కొన్నారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు ఆధ్వర్యంలో ఈ ఉత్సవం జరుగుతుందని తెలిపారు. ఆ రోజు సాయంత్రం మద్దిలోని షరాబుల వీధిలో నుంచి అమ్మవారి ప్రతిమలను జంక్షన్‌లో శ్రీదుర్గ శాస్త అయ్యప్ప పీఠం ప్రాంగణంలోని సాగర దుర్గ ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకువెళ్తామన్నారు.

రోడ్డు సరే.. కాలువలేవీ?

- డ్రైనేజీలు లేకుండా రోడ్డు నిర్మాణం
- రెడ్డిపల్లిలో ప్రజల అవస్థలు



సైడు కాలువలు నిర్మించకుండా వేసిన బీటీ రోడ్డు

రెడ్డిపల్లి గ్రామంలో కొత్త రోడ్డు వేస్తున్నారన్న ఆనందం గ్రామస్తుల్లో ఆవిరైపోతోంది. డ్రైనేజీలు లేకుండా రోడ్డు నిర్మాణం చేపట్టడంతో మండి పడుతున్నారు. డ్రైనేజీలు నిర్మించక ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోయి.. ఇళ్లు, దుకాణాల ముందు మురుగుకూపాలు ఏర్పడ్డాయి. ఒకవైపు దుర్గంధం, మరోవైపు దోమలతో గ్రామస్తులు చుక్కలు చూస్తున్నారు. ఇవేమి పనులు భగవంతుడా అంటూ ఆందోళన చెందుతున్నారు.



గాంధీ నగర్‌లోకి వెళ్లే మార్గం సమీపంలో నిలిచిపోయిన మురుగు నీరు



యాతపేట వద్ద తాగునీటి బోరు బావిని ఆనుకుని నిల్వ ఉన్న మురుగు నీరు



ఆకిరి వీధిలోకి వెళ్లే మార్గం వద్ద నిలిచిన మురుగు నీరు



రామాలయం సమీపంలో మురికి నీరు పోయేందుకు కర్రతో చెత్తను తొలగిస్తున్న మహిళ

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లిలో సైడు కాలువలు నిర్మించకుండా రోడ్డు వేస్తున్నారు. దీంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పద్మనాభం జంక్షన్‌కు సమీపంలోని కన్నయ్య కోనేరు నుంచి రెడ్డిపల్లి సినిమా థియేటర్ వరకు 3.5 కిలోమీటర్ల నిడివి గల రోడ్డును విస్తరించడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.10.04కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో రహదారి విస్తరణతో పాటు డ్రైనేజీలు కూడా నిర్మించాలి. రెడ్డిపల్లిలో 20 అడుగుల వెడల్పు ఉన్న రోడ్డును 40 అడుగులు విస్తరించడానికి రోడ్డుకిరుపక్కలా ఇళ్లు, షాపులను తొలగించారు. ఈ తొలగింపులో పాత సైడు కాలువలు శిథిలమై పూడుకుపోయాయి. దీంతో వర్షం వస్తే డ్రైనేజీలు పొంగిపోయి, మురుగునీరు రోడ్డుపైకి వస్తోంది. దీంతో ఈ రోడ్డు మీదుగా విజయనగరం , సింహాచలం వెళ్లే వాహన చోదకులు, ప్రజలు ఇబ్బంది పడేవారు. రోడ్డు విస్తరణలో భాగంగా శేరిఖండం వద్ద కల్వర్టు నిర్మించారు. ఈ క్రమంలో ఎన్నికలు రావడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆనంతరం పనులు చేపట్టకపోవడంతో రోడ్డు వేయాలంటూ మహిళలు చేపట్టిన ధర్నాతో ఎట్టకేలకు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.

ఇదీ పరిస్థితి..

వాస్తవానికి రోడ్డు నిర్మించడానికి ముందు డ్రైనేజీలు నిర్మించాలి. కానీ డ్రైనేజీలు కట్టకుండా రోడ్డు వేసేస్తున్నారు. ఇప్పటికే అధికభాగం ఒక లేయర్ బీటీ రోడ్డు వేశారు. సైడు కాలువలు నిర్మించకుండా బీటీ రోడ్డు వేయడం వల్ల వర్షం కురిస్తే మురుగు నీరంతా రోడ్డు మీదకు వచ్చేస్తోంది. యాతపేట వద్ద మురుగు నీరు ఇళ్లలోకి వెళ్లి పోయే పరిస్థితి నెలకొంది. వర్షపు నీటికి రోడ్డు కూడా శిథిలమయ్యే పరిస్థితి ఉంది. పేర్రాజు ఇంటి నుంచి యాతపేట వరకు రోడ్డుకిరువైపులా నీరు ఎక్కడికక్కడే నిలిచిపోయింది. చెత్త చెదారంతో డ్రైనేజీలు పూడుకుపోయి దుర్గంధం, దోమలతో గ్రామస్తులు కంటి మీద కునుకు లేక ఇబ్బంది పడుతున్నారు. రెడ్డిపల్లిలో ఇప్పటికే ఫైలేరియా వ్యాధిగ్రస్తులు ఎక్కువగా ఉన్నారు. ఇప్పుడు డ్రైనేజీలు నిర్మించకపోవడంతో మురుగునీరు పారకుండా నిలిచిపోవడం వల్ల దోమలు మరింత వృద్ధి చెందితే వ్యాధిగ్రస్తులు పెరిగే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సైడు కాలువలు లేక పాన్ షాపులు, టీ దుకాణాల వద్దకు వెళ్లడానికి వీలు కాక చిన్నచిన్న చెక్కలు వేసుకుని వ్యాపారులు, వినియోగదారులు రాకపోకలు సాగిస్తున్నారు. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు స్పందించి ముందుగా సైడు కాలువలు నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మళ్లీ ధర్నా చేస్తారేమో అని..



రోడ్డుపై ధర్నా చేస్తున్న మహిళలు (ఫైల్)

మహిళలు మళ్లీ ధర్నా చేస్తారేమోనని రెడ్డిపల్లి రోడ్డు నిర్మాణ పనులను వెనుకది ముందు, ముందుది వెనుక అన్నట్లు చేసేస్తున్నారు. వాస్తవంగా ముందు డ్రైనేజీలు నిర్మించి, తర్వాత బీటీ రోడ్డు వేయాలి. ఇలా కాకుండా ముందు రోడ్డు వేస్తున్నారు.

- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించకుండా తాత్సారం చేయడంతో మహిళలు డిసెంబర్ 31న రెడ్డిపల్లి రామాలయం వద్ద గోతులు పడిన రోడ్డుపై ధర్నా చేశారు. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు జనవరి 20 నుంచి రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. రోడ్డు పనులు ప్రారంభించకపోవడంతో మహిళలు మళ్లీ ధర్నాకు సిద్ధమవుతున్నారని తెలియడంతో రోడ్డు పనులు ప్రారంభించారు. అయితే, అధికారులు ముందు సైడు కాలువలు నిర్మిస్తామని ప్రకటించారు. కాని దీన్ని మరిచి రోడ్డు పనులు చేపడుతున్నారు.

ఇళ్ల వద్ద మురుగు కూపాలు



డ్రైనేజీలు నిర్మించకపోవడంతో మురుగు నీరు పైకి వెళ్లడం లేదు. ఇళ్లను ఆనుకుని ఎక్కడికక్కడే ఉండిపోతోంది. ఇళ్ల ముందు మురుగు నీరు నిలిచిపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నాం.

– డి.లక్ష్మి, రెడ్డిపల్లి

కంటి మీద కునుకు లేదు



సైడు కాలువలు లేక మురుగు నీరు నిలిచిపోయి దోమలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో రాత్రి వేళల్లో కంటి మీద కునుకు ఉండట్లేదు. చిన్న, పెద్ద అందరం నిద్ర లేక చాలా ఇబ్బందిపడుతున్నాం. దోమకాటుకు ఫైలేరియా వస్తుందేమో అని హడలిపోతున్నాం.

– డి. పరదేశి, రెడ్డిపల్లి

సైడు కాల్వలు నిర్మించాలి



రోడ్డు వేసే ముందు సైడు కాల్వలు కట్టాలి. కానీ ఇక్కడ డ్రైనేజీ లేకుండా రోడ్డు వేసేస్తున్నారు. దీంతో యాతపేట ప్రాంతం మురుగు కూపంగా తయారైంది. దుర్గంధంతో ఇళ్లలో ఉండలేకపోతున్నాం. కానీ గత్యంతరం లేదు. ఇక్కడే ఉంటూ ఆ దుర్గంధమే పీలుస్తూ జీవనం సాగించాల్సిన దుస్థితి.

– డి.ముత్యాలమ్మ, రెడ్డిపల్లి

డ్రైనేజీలు నిర్మిస్తాం

సైడు కాలువలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం. కొన్ని అత్యవసర పరిస్థితుల్లో ముందుగా రోడ్డు వేయాల్సి వచ్చింది. ఇంకా కల్వర్టులు నిర్మించాలి. ఈ కల్వర్టులతో పాటు సైడు కాలువలు నిర్మిస్తాం.

– శైలజ, ఆర్‌అండ్‌బీ ఏఈ

కేజీబీవీని సందర్శించిన రాష్ట్ర కార్యదర్శి



ఆనందపురం కేజీబీవీలో విద్యార్థినులను బయాలజీపై ప్రశ్నిస్తున్న దేవానందరెడ్డి

తగరపువలస: ఆనందపురం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని రాష్ట్ర కార్యదర్శి డి.దేవానందరెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా 9వ తరగతి విద్యార్థినులతో మాట్లాడారు. స్వయం పోషణ అనే బయాలజీ పాఠ్యాంశాన్ని 25 నిమిషాల పాటు చదివించారు. అందులో నుంచి వారు గమనించిన విషయాన్ని చెప్పించారు. పాఠ్యాంశంలో సందేహాల గురించి తోటి విద్యార్థినులతో ప్రశ్నలు అడిగించారు. దానినే నోట్సు రాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యపుస్తకంలో చదివిన అంశాన్ని గ్రహించి నిత్య జీవితంలో ఎలా అన్వయించుకోవాలో అర్థం చేసుకుంటారన్నారు.

పద్మనాభం కేజీబీవీలో..

పద్మనాభం: పద్మనాభం కస్తూర్బా విద్యాలయాన్ని కేజీబీవీ రాష్ట్ర కార్యదర్శి డి.దేవానందరెడ్డి శనివారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థినులకు చదువుతో పాటు విలువలు కూడా నేర్పాలన్నారు. బోధించే విషయాలు నిత్య జీవితంలో విద్యార్థినులకు ఉపయోగపడే విధంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థినులు పరీక్షలు ఎలా రాస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆయన వెంట విద్యాశాఖ ఆర్జేడీ విజయ్ భాస్కర్, సమగ్ర శిక్షా అభియాన్ జిల్లా అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ చంద్రశేఖర రావు, సీఎంవో దేముడుబాబు ఉన్నారు.

ఉత్సవ ఏర్పాట్లపై ఎమ్మెల్యే తనయుడి సమీక్ష



అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహిస్తున్న గంటా రవితేజ

భీమునిపట్నం: ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న భీమిలి గ్రామదేవత నూకాలమ్మ వారి ఉత్సవ ఏర్పాట్లపై అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు గంటా రవితేజ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నిర్వహించవలసి ఉండగా, ఆయన తనయుడు రవితేజ నిర్వహించారు. అయితే, ఎటువంటి అధికారం లేకుండా రవితేజ ఇలా అధికారులతో సమావేశం నిర్వహించడమేమిటని అక్కడ పలువురు చర్చించుకున్నారు. ఈ అంశం విమర్శలకు దారి తీసింది.

ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

ఉత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని సమావేశంలో పాల్గొన్న అధికారులు తెలిపారు. నార్త్ ఏసీపీ ఎస్.అప్పలరాజు మాట్లాడుతూ ఉత్సవాలు జరిగే నాలుగు రోజులూ పటిష్ట పోలీస్ బందోబస్తు నిర్వహిస్తామన్నారు. ఆలయ ఈవో బి.మురళీమోహన్ మాట్లాడుతూ భక్తులకు సదుపాయాల కల్పన, క్యూలైన్లు ఏర్పాటు చేస్తామన్నారు. మంచినీటి సదుపాయం, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జెడ్సీ ప్రేమప్రసన్నవాణి తెలియజేశారు.

జనరల్ స్టోర్‌లో అగ్నిప్రమాదం



బాధితులను పరామర్శిస్తున్న రాష్ట్ర కళింగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సూరిబాబు

మధురవాడ: మధురవాడ గణేష్‌నగర్‌లోని రాజేశ్వరి కిరాణా జనరల్ స్టోర్ వద్ద శనివారం ఉదయం ఐదు గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగింది. ఇందులో సుమారు రూ. 20లక్షలు విలువ చేసే సామగ్రి దగ్ధమైనట్లు బాధితుడు కందుల శ్రీధర్ తెలిపారు. ఉదయం దుకాణంలోంచి పొగలు రావడంతో, స్థానికులు యజమాని శ్రీధర్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన దుకాణం వద్దకు చేరుకునే లోపే సామగ్రి మొత్తం కాలి బూడిదైపోయింది. విశాఖ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి, మంటలను అదుపు చేశారు. బాధితులను రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ మాజీ చైర్మన్ అందవరపు సూరిబాబు, రైతు సంఘ నాయకులు వారణాసి నగేష్, అల్లిపురం కళింగ వైశ్య సంఘ అధ్యక్షుడు ఉన్నా మోహన్ తదితరులు పరామర్శించారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భీమునిపట్నం: భీమిలిలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గంగాకుమారి తెలిపారు. ఇందులో 6వ తరగతి, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో ప్రవేశాలకు అవకాశం ఉందని పేర్కొన్నారు. 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 40 సీట్లు, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 7 సీట్లు ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నిరుపేద కుటుంబాలకు చెందినవారు, అనాథలు, మధ్యలో బడి మానేసిన వారు, ఎస్సీ..ఎస్టీ మైనార్టీ బాలికలు ప్రవేశాలకు అర్హులని తెలియజేశారు.

జలమే జీవనాధారం

- నీటి ఆవశ్యకత, పొదుపుపై విద్యార్థులకు అవగాహన
- విద్యాలయాల్లో ప్రపంచ జల దినోత్సవం



చంద్రంపాలెం హైస్కూల్లో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న హెచ్‌ఎం రవి



జల దినోత్సవం గురించి విద్యార్థులకు వివరిస్తున్న బంగ్లామెట్ట పాఠశాల ఉపాధ్యాయులు

తగరపువలస: ప్రాణకోటి మనుగడకు నీరే జీవనాధారమని చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీవాణి అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా కళాశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులకు నీటి ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. నీటి ఎద్దడికి అధిక జనాభా, కాలుష్యం, అడవుల నరికివేత, నీటి దుర్వినియోగం కారణమన్నారు. ప్రతి నీటిబొట్టును కాపాడవలసిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. ఈ సందర్భంగా నీటి పరిరక్షణ–విద్యార్థుల బాధ్యత అనే అంశంపై విద్యార్థులకు పోస్టర్ ప్రదర్శన, వ్యాస రచన పోటీలు నిర్వహించారు.

– బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. స్థానికులకు నీటి ఆవశ్యకత గురించి తెలియజేశారు. 1993లో ఐక్యరాజ్యసమితి సాధారణ సభ ప్రపంచ జల దినోత్సవాన్ని ప్రకటించిందన్నారు. నీటి కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో నీటి సంరక్షణ, సురక్షిత తాగునీరు గురించి ప్రతి ఒక్కరు చైతన్యవంతులు కావాలన్నారు. ఉపాధ్యాయులు రెడ్డిపల్లి అప్పలరాజు, బుగత మల్లిక, ఈగల సంజీవి తదితరులు పాల్గొన్నారు.

చంద్రంపాలెం హైస్కూల్లో..

మధురవాడ: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం గొట్టేటి రవి మాట్లాడుతూ 2050నాటికి నీటి అవసరాలు 55శాతం పెరిగే అవకాశం ఉందని గణాంకాలు చెబుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ నీటిని పొదుపు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే భవిష్యత్తు

తగరపువలస: రసాయనరహిత ఎరువులతో భూమిని సాగుచేయడం ద్వారా మనకు భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర గ్రామ వికాస అధ్యక్షుడు తిరుపతయ్య అన్నారు. భీమిలి మండలం శింగనబందలో శనివారం నిర్వహించిన భూ సంరక్షణ కార్యక్రమంలో భాగంగా భూమాత, గోమాత పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 30 వరకు దేశమంతా కోట్లాది మంది రైతులు భూమాత పూజ నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయంతో గ్రామాలను ఎలా కాపాడుకోవాలో వివరించారు. కార్యక్రమంలో జిల్లా సంయోజిక్ వెంకటప్పడు, మహా నగర్ సంయోజిక్ నరసింగరావు, విస్తారక్ రవి, ఆనందపురం ఖండ్ సహ సంయోజిక్ సీలాపు సూర్యనారాయణరెడ్డి, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

యువత మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలి



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న జేఎన్‌టీయూ విజయనగరం వీసీ రాజ్యలక్ష్మి, ముత్తంశెట్టి

తగరపువలస: యువత కష్టపడి చదువుకుని ఉద్యోగం సాధించి, వారి భవిష్యత్తును చక్కగా నిర్మించుకోవాలని జేఎన్‌టీయూ–విజయనగరం ఉపకులపతి డి.రాజ్యలక్ష్మి అన్నారు. చెరకుపల్లి అవంతి విద్యాసంస్థలలోని ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన అవంతియన్స్ గ్రాడ్యుయేషన్, అచీవర్స్ డే వేడుకలలో పాల్గొన్న ఆమె విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు, దివీస్ లేబరేటరీ జనరల్ మేనేజర్ ఎంఎస్ఎన్ రావు తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా పట్టభద్రులకు సర్టిఫికెట్లు, పతకాలు, ప్రశంసా పత్రాలు, నియామకపత్రాలు అందించారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులకు స్వర్ణ, రజత పతకాలు అందించారు. కార్యక్రమంలో సింబయాసిస్ టెక్నాలజీ సీఈవో ఓరుగంటి నరేష్, అవంతి విద్యాసంస్థల ప్రధాన కార్యదర్శి ప్రియాంక, వైస్ చైర్మన్ శివనందీష్, ఎండీ శ్రవణ్‌కుమార్, డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్, ప్రిన్సిపాల్స్, ప్లేస్‌మెంట్ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రణీత్‌బాబుకు నివాళులు



మజ్జి ప్రణీత్‌బాబు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న రెండోవార్డు నాయకులు

తగరపువలస: చికిత్స పొందుతూ ఇటీవల ఆస్పత్రిలో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు కుమారుడు ప్రణీత్‌బాబుకు జీవీఎంసీ రెండోవార్డు నాయకులు శనివారం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విజయనగరంలోని ఆయన నివాసంలో చిన్నశ్రీనును పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్‌రెడ్డి, పందిరి విజయకుమార్, తెడ్లాపు అప్పలరాజు, చిల్ల సూరినరసయ్యరెడ్డి, గఫూర్ పాల్గొన్నారు.

ఘనంగా శాలివాహన చక్రవర్తి జయంతి



శాలివాహన చక్రవర్తికి నివాళులు అర్పిస్తున్న శాలివాహన కుమ్మరి సంఘం ప్రతినిధులు

తగరపువలస: సంతపేట కుమ్మరివీధి రామాలయంలో విశాఖ కుమ్మరి శాలివాహన సంఘం అధ్యక్షుడు అరటికోట్ల వెంకటేష్ ఆధ్వర్యంలో శాలివాహన చక్రవర్తి జయంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆలయ అర్చకుడు మేకా శంకరశర్మ ఆధ్వర్యంలో శాలివాహనుడి చిత్రపటానికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శాలివాహనుడి శౌర్యపరాక్రమాల గురించి గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సంఘం స్థానిక అధ్యక్షుడు తాటిపూడి శ్రీనివాసరావు, కొప్పాక రామకృష్ణ, పెనుగుర్తి వెంకట సన్యాసిరావు, జామి శ్రీను, శ్రీకాకుళం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న నాయకులు

తగరపువలస: ఆనందపురం మండలం లొడగలవానిపాలెం పంచాయతీ నేలతేరులోని శ్రీసీతారామ అభయ ఆంజనేయస్వామి ఆలయ 16వ వార్షికోత్సవం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, ఆలయ ధర్మకర్త బంక సూర్యనారాయణ, మండల ప్రముఖులు పాండ్రంగి అప్పారావు, రౌతు వెంకటరావు, బంక కృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.